ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్మార్ట్ ఎడిషన్
Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 38 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు : 3 + https:www.prajarepublic.com + వెల - 1/- | గురువారం 12 సెప్టెంబర్ 2024

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

## రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవట్లేదు : కేటీఆర్

■ రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవట్లేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు.

హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 12: రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవట్లేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. రుణమాఫీ కాలేదని కొందరు రైతులు ప్రాణాలు వదులుకోవడం ఆందోళనకరమన్నారు. పెట్టుబడి సాయం లేక మరికొందరు ప్రాణాలు వదిలారని చెప్పారు. కేసీఆర్ రైతును రాజు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం వారి ప్రాణాలు తీస్తోందన్నారు. రుణమాఫీ, రైతు భరోసా బోగస్ అని పేర్కొన్నారు. డిసెంబర్ లో పెట్టిన డెడ్లైన్ సెప్టెంబర్ దాటినా అమలు కాకపోతే దగాపడ్డ అన్నదాతలు ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. రేవంత్రెడ్డి దిల్లీ యాత్రలు చేయడం కాదు.. రాష్ట్రంలో ఏం జరుగుతుందో చూడాలని డిమాండ్ చేశారు. ఎవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని.. ధైర్యంగా ఉండాలని కేటీఆర్ సూచించారు.



## రూ.2వేల కోట్ల ట్రేడింగ్ స్కామ్.. నటి అరెస్టు

● ఆన్లైన్ స్టాక్ ట్రేడింగ్ స్కామ్‌లో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ నటిని పోలీసులు అరెస్టు చేశారు.



గువాహటి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 12: అస్సాంలో కలకలం సృష్టించిన ఆన్లైన్ స్టాక్ ట్రేడింగ్ స్కామ్‌లో ఒక నటిని పోలీసులు అరెస్టు చేశారు. గురువారం స్పెషల్ టాస్క్ ఫోర్స్ నటి సుమిబోరా, ఆమె భర్త తార్కిక్ బోరాను అదుపులోకి తీసుకుందని పోలీసులు ఉన్నతాధికారులు వెల్లడించారు. ఈ కేసులో వీరిపై ఇప్పటికే లుకౌట్ నోటీసులు జారీ అయిన నేపథ్యంలో తాజాగా వారి అరెస్టు చోటుచేసుకుంది. అస్సాం పోలీసులు ఇటీవల రూ.2 వేల కోట్ల కుంభకోణం గుట్టు రట్టు చేశారు. పెట్టుబడిని రెట్టింపు చేస్తామంటూ స్టాక్మార్కెట్ ఇన్వెస్ట్మెంట్ల పేరిట ప్రజల నుంచి మోసగాళ్లు సొమ్మును సమీకరించారు. ఈ కేసులో ఇప్పటికే విశాల్ ఫుకాన్ను అరెస్టు చేశారు. 60 రోజుల్లో పెట్టుబడులపై 30 శాతం రాబడి వస్తుందని విశాల్ నమ్మబలికాడు. నాలుగు నకిలీ సంస్థలను స్థాపించి, అస్సాం చిత్ర పరిశ్రమలో పెట్టుబడులు పెట్టాడు. పలు ఆస్తుల్ని కూడబెట్టాడు. ఈ కుంభకోణంలో బోరా దంపతులతో పాటు మరికొందరిపైనా ఆరోపణలు వచ్చాయి. అతడి అరెస్టు తర్వాతే వీరిని పోలీసులు విచారణకు పిలిచారు. అయితే వీరు హాజరుకాకపోవడంతో లుకౌట్ నోటీసులు జారీ చేసి, తాజాగా అదుపులోకి తీసుకున్నారు. బుధవారం సదరు నటి ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. "పరువుకు నష్టం కలిగించేలా నా కుటుంబంపై వార్తలు వస్తోన్న నేపథ్యంలో నేను పోలీసుల ముందు లొంగిపోవాలని, విచారణకు సహకరించాలని నిర్ణయించుకున్నాను. నేను ఎక్కడికీ పారిపోలేదు. మీడియాలో వస్తోన్న కథనాలతో మాకు ఎదురైన వేధింపుల వల్ల మేం పబ్లిక్కు దూరంగా ఉన్నాం. ఆ వార్తల్లో 10 శాతం కూడా వాస్తవం లేదు" అని వెల్లడించారు. ఆమె లొంగిపోతానని చెప్పిన మరుసటి రోజే. పోలీసులు అదుపులోకి తీసుకోవడం గమనార్హం. ఇదిలా ఉంటే.. తొలుత మీడియా కథనాల్లో ఈ స్కామ్ విలువ రూ.22 వేల కోట్లు అని రాగా.. తర్వాత ఆ మొత్తం రూ.2వేల కోట్లుగా పేర్కొన్నాయి.

## ట్రైనీ ఆర్మీ అధికారులను బెదిరించి..

## స్నేహితురాలిపై గ్యాంగ్ రేప్

ట్రైనీ ఆర్మీ అధికారులపై దాడి చేసి వారి స్నేహితురాలిపై అత్యాచారానికి పాల్పడిన ఘటన మధ్యప్రదేశ్లో చోటుచేసుకుంది.

భోపాల్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 12: మధ్యప్రదేశ్లోని ఇందౌర్లో లో దారుణం చోటుచేసుకుంది. స్నేహితురాళ్లతో కలిసి బయటకు వెళ్లిన ట్రైనీ ఆర్మీ అధికారులపై కొంతమంది దుండగులు దాడిచేశారు. వారి నుంచి డబ్బులు దోచుకోవడమే గాక.. వారి స్నేహితురాలిపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఇందౌర్‌లోని మోవ్ ఆర్మీ కాలేజీలో శిక్షణలో ఉన్న ఇద్దరు యువ ఆర్మీ అధికారులు తమ స్నేహితురాళ్లతో కలిసి సమీపంలోని ఓ పిక్నిక్ స్పాట్కు వెళ్లారు. అక్కడ కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు వీరిపై దాడి చేశారు. తొలుత వారి వద్ద ఉన్న డబ్బు, నగలను బెదిరించి తీసుకున్న దుండగులు.. ఆ తర్వాత మహిళల్లో ఒకరిపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ దాడి నుంచి తప్పించుకున్న ఓ ట్రైనీ ఆఫీసర్ పోలీసులు, ఆర్మీ ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకునేసరికి దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. బాధిత మహిళకు వైద్య పరీక్షలు నిర్వహించగా.. అత్యాచారం జరిగినట్లు నిర్ధరించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల్లో ఇద్దరిని అరెస్టు చేశారు. వీరికి గతంలో క్రిమినల్ రికార్డు ఉన్నట్లు గుర్తించారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.



## ఇంకా ఎంతకాలం కళ్లుమూసుకొని ఉంటారో..?

### ఇందౌర్ ఘటనపై రాహుల్ ఆగ్రహం

● మధ్యప్రదేశ్లో జరిగిన సామూహిక అత్యాచార ఘటనపై రాహుల్ గాంధీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.



దిల్లీ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 12: స్నేహితురాళ్లతో కలిసి బయటకు వెళ్లిన ట్రైనీ ఆర్మీ అధికారులపై కొంతమంది దుండగులు దాడి చేయడమే కాకుండా.. వారి స్నేహితురాలిపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. మధ్యప్రదేశ్లోని ఇందౌర్లో చోటుచేసుకున్న ఈ ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్సభ ఎంపీ రాహుల్ గాంధీ ఎక్స్(ట్విటర్) వేదికగా స్పందించారు. "ట్రైనీ ఆర్మీ అధికారులపై దాడి, వారి స్నేహితురాలిపై అత్యాచారం సమాజాన్ని సిగ్గుపడేలా చేసింది. భాజపా పాలిత రాష్ట్రాల్లో శాంతిభద్రలు కరువయ్యాయి. మహిళలపై రోజురోజుకు పెరుగుతోన్న నేరాల పట్ల భాజపా ప్రభుత్వం ప్రదర్శిస్తోన్న ప్రతికూల వైఖరి తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. యంత్రాంగం వైఫల్యం వల్లే నేరస్థులు ఇలాంటి దుస్సాహసాలకు ఒడిగడుతున్నారు. ఇలాంటి నేరాలు అమ్మాయిల స్వేచ్ఛ, ఆకాంక్షలకు అడ్డంకిగా మారుతాయి. జనాభాలో సగ భాగమైన ఆడపిల్లలపై ఇలాంటి ఘటనలు జరుగుతున్నా.. ఇంకా ఎంతకాలం కళ్లుమూసుకొని ఉంటారో..?" అని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇందౌర్‌లోని మోవ్ ఆర్మీ కాలేజీలో శిక్షణలో ఉన్న ఇద్దరు యువ ఆర్మీ అధికారులు తమ స్నేహితురాళ్లతో కలిసి సమీపంలోని ఓ పిక్నిక్ స్పాట్కు వెళ్లారు. అక్కడ కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు వీరిపై దాడి చేశారు. తొలుత వారి వద్ద ఉన్న డబ్బు, నగలను బెదిరించి తీసుకున్న దుండగులు.. ఆ తర్వాత మహిళల్లో ఒకరిపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ దాడి నుంచి తప్పించుకున్న ఓ ట్రైనీ ఆఫీసర్ పోలీసులు, ఆర్మీ ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకునేసరికి దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. బాధిత మహిళకు వైద్య పరీక్షలు నిర్వహించగా.. అత్యాచారం జరిగినట్లు నిర్ధరించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల్లో ఇద్దరిని అరెస్టు చేశారు. వీరికి గతంలో క్రిమినల్ రికార్డు ఉన్నట్లు గుర్తించారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

## దేశాలతో ఐకమత్యంగా ముందుకుసాగడమే భారత్ లక్ష్యం: రాజ్నాథ్ సింగ్

రాజస్థాన్లోని జోధ్పూర్లో జరుగుతున్న వాయుసేన విన్యాసాలను కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్నాథ్ వీక్షించారు. ఈ సందర్భంగా వివిధ దేశాలతో స్నేహపూర్వక సంబంధాలపై ఆయన మాట్లాడారు.



జైపూర్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 12: రాజస్థాన్లోని జోధ్పుర్లో జరుగుతున్న భారత వాయుసేన విన్యాసాలను కేంద్ర మంత్రి రాజ్నాథ్ సింగ్ వీక్షించారు. అనంతరం వివిధ దేశాలతో స్నేహపూర్వక సంబంధాలపై ఆయన మాట్లాడారు. ప్రపంచంలో ప్రస్తుతం ఎదురవుతున్న సవాళ్లను దృష్టిలో ఉంచుకొని అన్ని దేశాలు తమ భాగస్వామ్యాన్ని, సహకారాన్ని మెరుగుపరచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుతం అనేక దేశాలు యుద్ధాల్లో మునిగితేలుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ తరుణంలో వాటన్నింటితో ఐకమత్యంగా ముందుకుసాగడమే భారత్ ముందున్న లక్ష్యమని ఆయన వివరించారు. తేలికపాటి యుద్ధ విమానాలు, సెన్సార్లు, రాడర్ల తయారీ రంగాల్లో భారత్ ఎక్కువ స్వావలంబనను సాధిస్తోందన్నారు. ఇక, గతంలో ఇతర దేశాల నుంచి ఆయుధాలు, పరికరాల పరంగా దిగుమతి చేసుకొనే దేశంగా మాత్రమే భారత్ కనిపించేదన్నారు. ప్రస్తుతం భారత్ దాదాపు 90 దేశాలకు పైగా ఆయుధాలు, పరికరాలను ఎగుమతి చేస్తోందని తెలిపారు. ఇక, ఈ తారంగ్ శక్తి విన్యాసాల్లో అమెరికా, ఆస్ట్రేలియా, గ్రీస్ విమానాలు సైతం పాల్గొంటున్నాయి. ఈ విన్యాసాలు ఆగస్టు 30న ప్రారంభం కాగా ఈనెల 14 వరకు కొనసాగుతాయి.

## మద్యం కుంభకోణం కేసు..

## కేజీవాల్ బెయిల్ పిటిషన్ పై 13న సుప్రీం తీర్పు

మద్యం విధానానికి సంబంధించిన కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజీవాల్ బెయిల్ పిటిషన్ పై సుప్రీంకోర్టు శుక్రవారం తీర్పు వెలువరించనుంది.





దిల్లీ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 12: మద్యం విధానానికి సంబంధించిన సీబీఐ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజీవాల్ కు ఇంకా ఊరట లభించలేదు. ఈ కేసులో ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్పై సుప్రీంకోర్టు ఇటీవల తీర్పు రిజర్వ్ చేసిన సంగతి తెలిసిందే. దీనిపై శుక్రవారం తీర్పు వెలువరించనుంది. ఈమేరకు సుప్రీంకోర్టు వెబ్సైట్లో తీర్పు తేదీని వెల్లడించారు. మద్యం విధానానికి సంబంధించిన సీబీఐ కేసులో తన అరెస్టును సవాల్ చేయడంతో పాటు.. బెయిల్ కోసం అభ్యర్థిస్తూ కేజీవాల్ రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఇటీవల దీనిపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈసందర్భంగా ఆయన తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదిస్తూ.. సీబీఐ తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. "మద్యం విధానంపై కేసు నమోదు చేసిన తర్వాత రెండేళ్ల వరకు సీఎంను అరెస్టు చేయలేదు. ఎప్పుడైతే ఈడీ కేసులో బెయిల్ వచ్చిందో.. వెంటనే సీబీఐ 'ఇన్స్యూరెన్స్' అరెస్టుకు పాల్పడింది. అరెస్టుకు ముందు ఎలాంటి నోటీసులు కూడా పంపించలేదు" అని కోర్టుకు వివరించారు. మరోవైపు, కేజీవాల్ బెయిల్ అభ్యర్థనను సీబీఐ వ్యతిరేకించింది. ఈ కేసులో బెయిల్ కోసం ఆయన సెషన్స్ కోర్టుకు వెళ్లకుండా నేరుగా హైకోర్టుకు వెళ్లారని సుప్రీం దృష్టికి తీసుకొచ్చింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఈ ఏడాది మార్చి 21న ఈడీ అధికారులు కేజీవాల్ను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే మధ్యంతర బెయిల్ మంజూరైంది. అయితే, సీబీఐ కేసులోనూ కేజీవాల్ అరెస్టయ్యారు. జూన్ 27 నుంచి సీబీఐ జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా తిహాడ్ జైల్లో ఉన్నారు.

## వైద్యుల నిరసనల వేళ..

## ఆర్జీ కర్ ఆస్పత్రి వద్ద బ్యాగు కలకలం

కోల్‌కతాలోని ఆర్జీ కర్ ఆస్పత్రి వద్ద ఓ అనుమానస్పద బ్యాగు తీవ్ర కలకలం రేపింది. అందులో బాంబు ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి.



కోల్‌కతా, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 12: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన వైద్యురాలి హత్యాచార ఘటన పై పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ అమానుష ఘటన చోటుచేసుకున్న ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ఆస్పత్రి వద్ద జూనియర్ వైద్యులు నిరసన సాగిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆస్పత్రి వద్ద గురువారం ఓ బ్యాగు అనుమానాస్పదంగా కన్పించడం తీవ్ర కలకలం రేపింది. వైద్యులు నిరసనలు చేస్తున్న శిబిరం వద్ద ఓ బెంచీపై ఈ బ్యాగును గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. వారు బాంబు స్క్వాడ్తో ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. బ్యాగులో బాంబు ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవడంతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి. ప్రస్తుతం అక్కడ పోలీసులు ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. ముందుజాగ్రత్త చర్యగా ఆ ప్రదేశాన్ని ఖాళీ చేయించారు. ఆగస్టు 9న వైద్యురాలి హత్యాచార ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. అప్పటి నుంచి మృతురాలికి న్యాయం జరగాలంటూ జూనియర్ వైద్యులు ఆందోళనలు సాగిస్తున్నారు. వీరంతా తిరిగి విధుల్లో చేరాలని సుప్రీంకోర్టు సూచించినప్పటికీ.. వైద్యులు నిరసనల్లో పాల్గొంటున్నారు. మరోవైపు, వీరిని చర్చలకు రావాల్సిందిగా బెంగాల్ ప్రభుత్వం ఆహ్వానించింది. అయితే చర్చలకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హాజరుకావాలని, 30 మంది ప్రతినిధులను అనుమతించాలని, భేటీని ప్రత్యక్ష ప్రసారం చేయాలని వైద్యులు షరతులు పెట్టారు. వీటిని మాత్రం బెంగాల్ సర్కారు తిరస్కరించింది. దీంతో చర్చలపై ప్రతిష్టంభన నెలకొంది.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారం..

# హైకోర్టులో ప్రభుత్వం లంచ్ మోషన్ పిటిషన్!

**ఛత్తీస్గఢ్ నుంచి విద్యుత్ కొనుగోళ్ల విషయంపై హైకోర్టులో విచారణ జరిగింది.**



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 12: ఛత్తీస్గఢ్ నుంచి విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం హైకోర్టులో లంచ్మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. విద్యుత్ కొనుగోలుకు సంబంధించి బకాయిల చెల్లింపుపై వివాదం కొనసాగుతోంది. రూ.261 కోట్లు చెల్లించాలని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఫిర్యాదు చేయడంతో తెలంగాణ డిస్కమ్లు విద్యుత్ కొనుగోలు బిడ్లో పాల్గొనకుండా నేషనల్ డిస్పాచ్ సెంటర్ అడ్డుకుంది. ఉదయం నుంచి విద్యుత్ కొనుగోలుకు బిడ్లు వేయకుండా పవర్ ఎక్స్ఛేంజీలు నిలిపివేశాయి. దీంతో గత్యంతరం లేక పవర్ గ్రిడ్పై రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ వేసింది. ట్రాన్స్-కో-జెన్కో సీఎండీ రొనాల్డ్ రాస్ వాదనల కోసం హైకోర్టుకు వెళ్లారు. ఇప్పటికే తెలంగాణ డిస్కమ్లు ఈ విషయంపై సీఈఆర్సీని ఆశ్రయించాయి.

## కౌశిక్ రెడ్డికి పూర్తి భద్రత కల్పించాలి: హరీశ్ రావు

**ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పై దాడి జరిగిందని, ఈ ఘటనను ఖండిస్తున్నట్లు మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్ రావు తెలిపారు.**



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 12: ఎమ్మెల్యే కౌశిక్రెడ్డిపై దాడి జరిగిందని, ఈ ఘటనను ఖండిస్తున్నట్లు మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్ రావు తెలిపారు. ఇదేం ప్రజాస్వామ్యం.. ఇదేం ప్రజాపాలన.. ఇదేం ఇందిరమ్మ రాజ్యం అని ప్రశ్నించారు. "మా పార్టీ ఎమ్మెల్యేలను కాంగ్రెస్లో చేర్చుకుని మాపైనే దాడి చేయించడం దుర్మార్గం. భారాస ఎమ్మెల్యేలపై దాడులు చేయించడం హేయమైన చర్య. కాంగ్రెస్ విద్రోహ, వికృత, అప్రజాస్వామిక వైఖరిని ఖండిస్తున్నాం. సీఎం రేవంత్రెడ్డి ప్రోద్బలంతో జరిగిన దాడి ఇది. సీఎం వెంటనే ఎమ్మెల్యే కౌశికెడ్డికి క్షమాపణ చెప్పాలి. దాడిని నిలువరించడంలో ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ విఫలమైంది. కౌశిక్రెడ్డికి పూర్తి భద్రత కల్పించాలి" అని హరీశ్రావు డిమాండ్ చేశారు.

# అంతర్జాతీయ మ్యాచ్ల నిర్వహణకు మంగళగిరి స్టేడియం: ఎంపీ కేశినేని శివనాథ్

**ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సహకారంతో గుంటూరు జిల్లా మంగళగిరిలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో స్పోర్ట్స్ సెంటర్ను ఏర్పాటు చేస్తామని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.**



విజయవాడ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 12: ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సహకారంతో గుంటూరు జిల్లా మంగళగిరిలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో స్పోర్ట్స్ సెంటర్ను ఏర్పాటు చేస్తామని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పేర్కొన్నారు. గురువారం మంగళగిరిలో అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధికి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నామని శివనాథ్ తెలిపారు. విశాఖలో ఉన్న అంతర్జాతీయ క్రికెట్ మైదానానికి తోడుగా మరో మైదానాన్ని నిర్మిస్తామని చెపారు. మంగళగిరిలోని క్రికెట్ మైదానాన్ని అంతర్జాతీయ మ్యాచ్ల నిర్వహణకు వీలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. త్వరలోనే క్రికెట్ మైదానం వద్ద మౌలిక వసతుల కోసం నిధులు కేటాయించనున్నట్టు వివరించారు.

# కౌశిక్ రెడ్డి ఇంటికి వెళ్లిన అరెకపూడి గాంధీ.. ఉద్రిక్తత

**ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, కౌశిక్ రెడ్డి సవాళ్లు, ప్రతిసవాళ్లతో తెలంగాణాలో పొలిటికల్ హీట్ నెలకొంది.**



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 12: ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, కౌశిక్ రెడ్డి సవాళ్లు, ప్రతిసవాళ్లతో తెలంగాణాలో పొలిటికల్ హీట్ నెలకొంది. కొండాపూర్లోని కౌశిక్ రెడ్డి ఇంటికి అరెకపూడి గాంధీ వెళ్లారు. పెద్ద ఎత్తున తన అనుచరులతో బయల్దేరి వెళ్లారు. గాంధీ ఇంటికి వెళ్లి భారాస కండువా కప్పుతానని ఇటీవల కౌశిక్ రెడ్డి వ్యాఖ్యానించారు. దీనిపై అరెకపూడి గాంధీ తీవ్రస్థాయిలో స్పందించారు. ఎన్నికల్లో గెలిపించకపోతే చనిపోతానని భయపెట్టి ఎమ్మెల్యేగా గెలిచిన కౌశిక్ రెడ్డి లాంటి కోవర్టులకు తన గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. తన ఇంటికి ఆయన రాకపోతే.. తానే ఆయన ఇంటికి వెళతానని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో కౌశిక్ రెడ్డి ఇంటికి అరెకపూడి గాంధీ వెళ్లారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. కొంతమంది అరెకపూడి అనుచరులు కౌశిక్ రెడ్డి ఇంటి గేటు ఎక్కి లోపలికి వెళ్లేందుకు యత్నించారు. ఎన్నికల్లో గెలిపించకపోతే చనిపోతానని భయపెట్టి ఎమ్మెల్యేగా గెలిచిన కౌశిక్రెడ్డిలాంటి కోవర్టులకు తన గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. తన ఇంటికి ఆయన రాకపోతే.. తానే ఆయన ఇంటికి వెళతానని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో కౌశిక్ రెడ్డి ఇంటికి అరెకపూడి గాంధీ వెళ్లారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. కొంతమంది అరెకపూడి అనుచరులు కౌశిక్ రెడ్డి ఇంటి గేటు ఎక్కి లోపలికి వెళ్లేందుకు యత్నించారు.

## అక్కడే బైఠాయించిన అరెకపూడి గాంధీ.. అరెస్ట్

కౌశిక్ రెడ్డి ఇంటివద్ద తన అనుచరులతో కలిసి అరెకపూడి గాంధీ బైఠాయించారు. పోలీసులు ఆయన్ను పంపించే ప్రయత్నం చేయగా ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌశిక్ రెడ్డిని బయటకు పిలవాలని.. లేదంటే తననే లోపలికి పంపించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో పోలీసులు, అరెకపూడి గాంధీ అనుచరుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. కొందరు అనుచరులు గేటు తోసుకుంటూ కౌశిక్ రెడ్డి ఇంట్లోకి ప్రవేశించారు. అనంతరం గాంధీని పోలీసులు అరెస్ట్ చేశారు. అంతకుముందు అరెకపూడి గాంధీ మీడియాతో మాట్లాడారు. భారాసలోకి వచ్చినప్పటి నుంచి కౌశిక్రెడ్డి తీరు సరిగా లేదన్నారు. ఆయన తీరు వల్లే ఆ పార్టీ ఓటమి పాలైందని విమర్శించారు. ఆయన కోవర్టుగా వ్యవహరించారన్నారు. కౌశిక్ రెడ్డి వ్యక్తిత్వం తెలుసుకోకుండా భారాసలో స్థానం కల్పించారని మండిపడ్డారు. ఆయన ప్రాంతీయ విభేదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు.

# ప్రకాశం బ్యారేజిని సందర్శించిన కేంద్ర బృందం

**నగరంలోని ప్రకాశం బ్యారేజీని కేంద్ర బృందం సందర్శించింది. బ్యారేజీ నీటి ప్రవాహం తదితర విషయాలను జలవనరుల శాఖ అధికారులు వారికి తెలిపారు.**



విజయవాడ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 12: నగరంలోని ప్రకాశం బ్యారేజీని కేంద్ర బృందం సందర్శించింది. బ్యారేజీ నీటి ప్రవాహం తదితర విషయాలను జలవనరుల శాఖ అధికారులు వారికి తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను ఈఎన్సీ వెంకటేశ్వర్లు కేంద్రబృందానికి అందజేశారు. ఈ నెల 1న రికార్డు స్థాయిలో 11.43 లక్షల క్యూసెక్కుల వరద వచ్చిందని తెలిపారు. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో పరిస్థితి, ముంపునకు సంబంధించిన వివరాలను కేంద్ర బృందం దృష్టికి ఆయన తీసుకెళ్లారు.

## ముంపులోనే లంక గ్రామాలు.. పలుచోట్ల రాకపోకలకు ఇబ్బందులు





కాకినాడ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 12: ధవళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం నిలకడగా ఉంది. ఆనకట్ట వద్ద నీటిమట్టం 15.30 అడుగులుగా నమోదైంది. సముద్రంలోకి 15.24 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. కోనసీమలో లంక గ్రామాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. దీంతో పడవల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. శివాయలంక, కె. ఏనుగుపల్లి లంక ముంపులోనే ఉన్నాయి. ఎదురుబీడెం కాజ్వేపై వరద ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. అప్పనపల్లి కాజ్వేపై రాకపోకలు నిలిచిపోయాయి. కాకినాడ జిల్లా తాళ్లరేవు, మండలం కొత్తలంకకు వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మరోవైపు విజయవాడ- మైలవరం రహదారికి అధికారులు గండి కొట్టారు. నిల్వ ఉన్న బుడమేరు నీటిని కిందికి పంపేందుకు వారు యత్నిస్తున్నారు. రహదారిపై మొత్తం 7 చోట్ల గండ్లు కొట్టడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అల్లూరి జిల్లాలోని సీలేరు, బలిమెల జలాశయాలకు వరద పోటెత్తింది. సీలేరు జలాశయం 6 గేట్లు ఎత్తి 21 వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. బలిమెల జలాశయం 2 గేట్లు ఎత్తి 31 వేల క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు.

# జోగి రాజీవ్ బెయిల్ రద్దు చేయాలని హైకోర్టులో ఏసీబీ పిటిషన్


**● అగ్రిగోల్డ్ భూముల కేసులో మాజీ మంత్రి, వైకాపా నేత జోగి రమేష్ కుమారుడు రాజీవ్ బెయిల్ రద్దు చేయాలని ఏసీబీ అధికారులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.**



విజయవాడ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 12: అగ్రిగోల్డ్ భూముల కేసులో మాజీ మంత్రి, వైకాపా నేత జోగి రమేష్ కుమారుడు రాజీవ్ బెయిల్ రద్దు చేయాలని ఏసీబీ అధికారులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను న్యాయస్థానం వారంరోజులకు వాయిదా వేసింది.

# తిరుపతి జిల్లాలో రోడ్డు ప్రమాదం.. నలుగురి దుర్మరణం

**■ తిరుపతి జిల్లాలో జరిగిన ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. చంద్రగిరి మండలం భాకరాపేట కనుమ రహదారిలో కంటైనర్ లారీ అదుపుతప్పి కారు, బైక్పు ఢీకొట్టింది.**



చంద్రగిరి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 12: తిరుపతి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చంద్రగిరి మండలం భాకరాపేట కనుమ రహదారిలో కలకడ నుంచి చెన్నైకి టమాటోలు లోడుతో వెళ్తున్న కంటైనర్ లారీ అదుపుతప్పి.. తిరుపతి నుంచి పీలేరు వైపు వెళ్తాన్న కారు, బైకుపై పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం కారణంగా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ను క్రమబద్ధీకరించారు. కంటైనర్లో కింద ఉన్న కారులో ఎంత మంది ప్రయాణిస్తున్న దానిపై ఇంకా స్పష్టత లేదు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఘటనలో నలుగురు మృతి చెందినట్లు తెలుస్తోంది.

# ఎర్రమట్టి దిబ్బలపై విచారణకు ఆదేశించిన ఏపీ ప్రభుత్వం

**భీమిలి మండలంలో ఉన్న ఎర్రమట్టి దిబ్బలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.**



అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 12: విశాఖ ఎర్ర మట్టి దిబ్బలను ఆనుకొని ఉన్న నేరెళ్ల వలస గ్రామంలోని భీమునిపట్నం మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి ఇచ్చిన భూములను రద్దు చేయాలంటూ జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ ఇచ్చిన పిటిషన్పై ఏపీ ప్రభుత్వం స్పందించింది. భీమిలి మండలంలో ఉన్న ఎర్రమట్టి దిబ్బలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ను ఏపీ ప్రభుత్వం ఆదేశించింది. సర్వేనెంబర్ 118/ 5ఏ లో 250 ఎకరాలకు పైగా భూములను ఈ హౌసింగ్ సొసైటీకి కేటాయించారు. ఇవన్నీ ఎర్రమట్టి దిబ్బల ప్రాంతంలోనే ఉన్నాయని జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ ప్రభుత్వానికి ఆధారాలతో ఫిర్యాదు సమర్పించారు. వారసత్వ సంపదగా ఎర్రమట్టి దిబ్బల పరిరక్షణ చేయాలని మూర్తియాదవ్ కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్ ఇచ్చే నివేదిక ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

అరెకపూడి ఇంటికెళ్లి గులాబీ కండువా కప్పుతాం..

# పార్టీ తడాఖా చూపిస్తాం: కౌశిక్ రెడ్డి

**తన ఇంటి వద్దకు అరెకపూడి గాంధీ వచ్చి ఆందోళన చేపట్టడాన్ని భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఖండించారు.**



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 12: తన ఇంటి వద్దకు వచ్చి అరెకపూడి గాంధీ వచ్చి ఆందోళన చేపట్టడాన్ని భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్రెడ్డి ఖండించారు. రాష్ట్రంలో ఒక ఎమ్మెల్యేకే రక్షణ లేదని విమర్శించారు. సామాన్య ప్రజలకు ప్రభుత్వం రక్షణ ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. "హత్య చేయడానికి నా ఇంటి వద్దకు వచ్చారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు భారాస పార్టీ తడాఖా చూపిస్తాం. గురువారం అరెకపూడి గాంధీ చేసిన చర్యకు శుక్రవారం ప్రతిచర్య ఉంటుంది. గాంధీ కృష్ణా జిల్లా నుంచి హైదరాబాద్కు వచ్చారు. నేను నిఖార్సయిన తెలంగాణ బిడ్డను. ఆందోళన చేపట్టినవారు మహిళలపై కూడా దాడి చేశారు. నన్ను హత్య చేసే ప్రయత్నం చేశారు. నా ఇంట్లో నేను ఉంటే దాడి చేశారు. దాడి విషయాన్ని సీపీ దృష్టికి తీసుకెళ్లాలని ఫోన్ చేస్తే ఎత్తలేదు. శుక్రవారం ఉదయం 11 గంటలకు అరెకపూడి గాంధీ ఇంటికెళ్లి గులాబీ కండువా కప్పుతాం" అని కౌశిక్ రెడ్డి తెలిపారు.

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1886: ప్రఖ్యాత హిందుస్తానీ గాయకుడు సవాయి గంధర్వ జననం (మ. 1952).
- 1920: ప్రఖ్యాత నేత్రవైద్య నిపుణుడు పెరుగు శివారెడ్డి జననం (మ. 2005).
- 1921: తమిళ కవి, స్వాతంత్ర్య సమర యోధుడు సుబ్రహ్మణ్య భారతి మరణం (జ. 1882).
- 1943: ఆధునిక తెలుగు నిఘంటుకర్త రవ్వా శ్రీహరి జననం.
- 1972: ఆంగ్ల నటుడు, మార్షల్ ఆర్టిస్ట్ జాసన్ స్టాథమ్ జననం.
- 2009: హరిత విప్లవ పితామహుడు నార్మన్ బోర్లాగ్ మరణం (జ. 1914).


గాయకుడు సవాయి గంధర్వ


పెరుగు శివారెడ్డి


సుబ్రహ్మణ్య భారతి


రవ్వా శ్రీహరి


మార్షల్ ఆర్టిస్ట్ జాసన్ స్టాథమ్


నార్మన్ బోర్లాగ్

# నంద్యాలలో మట్కా మహమ్మారి

## ఇల్లు గుల్ల చేసుకుంటున్న మట్కా రాయుళ్ళు


### స్మార్ట్ ఫోన్‌లో చేరిన మట్కా భూతం

- పట్టణంలో పలు కేంద్రాలలో మట్కా నిర్వహణ
- ప్రతి రోజు కోట్లరూపాయలు మట్కా పాలు
- పట్టించుకోని పోలీస్ యంత్రాంగం

**నంద్యాల క్రైం, సెప్టెంబర్ 12 (రిపబ్లిక్ న్యూస్):** జిల్లా కేంద్రం నంద్యాలలో మట్కా మహమ్మారి విజృంభిస్తోంది. ఈ మట్కా మహమ్మారి భారిన పడి ఎంతో మంది మట్కా రాయుళ్ళు లక్షలు ఆర్జిస్తామన్న దురాశతో కష్టార్జితంను మాయాజాల నెంబర్లపై కట్టి తమ ఇళ్ళను గుల్ల చేసుకుంటున్నారు.పట్టణంలో నడిగడ్డ, సుంకులమ్మ వీధి, ఫరూఖ్ నగర్, కోట వీధి, నబీనగర్, సంజీవనగర్, పెద్దబండ ప్రాంతం, బాలాజీకాంప్లెక్స్, ఎన్‌జీఓస్ కాలనీ, నూనెపల్లె, బొగ్గులైన్, క్రాంతినగర్, నందమూరి నగర్, భూపనపాడు, పోలూరు, ఆలమూరు, పలుకూరు, తొగర్చేడు గ్రామాలతో పాటు గాజులపల్లె, గోపవరం, కోటకొండ, ఎల్లెత్తుల, రుద్రవరం, శిరివెళ్ళ, గోవిందపల్లె, యాళ్ళూరు,వెలుగోడు, సంతజూటూరు,కోవెలకుంట్ల, ఆలీకొండ, పేరుసోముల ప్రాంతాలలో మట్కా బుకీలు ఉండి మట్కారాయుళ్ళతో డబ్బులు కట్టించుకుంటున్నారు.

ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి రాత్రి 12 వరకు మట్కాలో నెంబర్ల గేమ్ నడిపిస్తారు. ఈ గేమ్‌లో భాగంగా ఆ రోజు రాబోయే రెండు నెంబర్లు ముందుగా ఊహించి పందెం కాయ వలపి ఉంటుంది. రెండు నెంబర్లలో మొదటి నెంబర్‌ను ఓపెనింగ్‌గా, చివరినెంబర్‌ను క్లోజింగ్‌గా పిలుస్తారు. ఓపెనింగ్, క్లోజింగ్ నెంబర్‌లపై పందెం కాస్తే రుపాయికి తొమ్మిది రూపాయల 50 పైసలు ఇస్తారు.ఇందులో రెండు రూపాయలుబుకీలు మినహాయించుకొని ఏడు రూపాయలు 50 పైసలు పందెం కాసిన వారికి ఇస్తారు. జోడి నెంబర్ పై కట్టిన వారికి రూపాయికి 95 రూపాయల ప్రకారం చెల్లిస్తారు. వంద రూపాయలలలోపు పందెంలు కాచిన వారికి డబ్బులు ఇచ్చే బుకీలు ఎక్కువ మొత్తం కట్టిన వారికి డబ్బులు ఇవ్వకుండా దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. దీంతో దిక్కు తోచని మట్కారాయుళ్ళు ఈ మట్కా పిచ్చితో ముంబై,బళ్ళారి, గోవా,పూణే, కర్ణాటక రాష్ట్రాలకు వెళ్ళి ఎక్కువ మొత్తాలతో పందెలు ఆడుతుంటారు. ప్రతి రోజు జిల్లాలో కోట్ల రూపాయలు పందెల రూపంలో మట్కా బుకీల చేతికి చేరంతుంది. కానీ వీరు గెలిచిన వారిలో కొందరికి మాత్రమే డబ్బులు చెల్లిస్తూ నెలకు కోట్ల రూపాయలను అక్రమంగా ఆర్జిస్తున్నారు.


### స్మార్ట్ ఫోన్‌లో చేరిన మట్కా భూతం





టెక్నాలజీ భారీగా పెరిగిన తర్వాత ఈ మట్కా భూతం స్మార్ట్ ఫోన్‌లలో చేరడంతో మట్కారాయుళ్ళు పందెంలు కాయడం మరింత సులభతరం అయ్యింది. స్మార్ట్ ఫోన్‌లలోమట్కా ఫన్, సారా 777, గామా 567, రాయల్ మట్కా, ఆర్ ఎస్‌పి మట్కా వంటి పలు యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా మట్కా నెంబర్లపై పందెంలు కాస్తే బుకీలకు ఎటువంటి కమీషన్ చెల్లింపులు లేకుండా గెలిచిన పందెం మొత్తం మట్కా రాయుళ్ళ బ్యాంక్ అకౌంట్ చేరుతుంది. దీంతో ఎక్కువగా యువత వీటిపై ఆకర్షణకు లోనయ్యి అనంతరం అప్పుల పాలయ్యి ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి నెలకొంది.

### పట్టించుకోని పోలీస్ యంత్రాంగం

జిల్లాకేంద్రంలో భారీస్థాయిలో బుకీలను పెట్టి ప్రతి రోజు కోట్ల రూపాయలతో మట్కాను నిర్వహిస్తుంటే పోలీస్ యంత్రాంగం పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మట్కా నిర్వాహకుల నుండి నెల నెల మాముళ్ళు వస్తున్నాయని ఆరోపణలు వినపడుతున్నాయి. అధికార పార్టీ నాయకులకు కూడా ప్రతి నెల లక్షల రూపాయలు అందిస్తున్నట్లు పుకార్లు షికార్ చేస్తున్నాయి. ఇప్పటి కైన పోలీస్ బాస్ ఈ మట్కా మహమ్మారి పై ఉక్కు పాదం మోపి సామాన్యుల ఇల్లు గుల్ల కాకుండా కాపాడాలని జిల్లా ప్రజలు కోరుకుంటున్నారు.









## భారత్ - బంగ్లా రెండో టెస్టు వేదిక మారనుందా?

### బీసీసీఐ వర్గాల క్లారిటీ!

**హిందూ మహాసభ నిరసనలు తెలిపేందుకు సిద్ధమైందన్న వార్తలు ఇటు క్రికెట్ అభిమానులను కలవరానికి గురి చేశాయి. అయితే, ఎలాంటి సందేహం లేదని బీసీసీఐ వర్గాలు భరోసా ఇస్తున్నాయి.**

భారత్-బంగ్లాదేశ్ జట్ల మధ్య రెండో టెస్టునకు కాన్పూర్ వేదిక. సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 1 వరకు జరగనుంది. అయితే, మ్యాచ్ జరగకుండా నిరసనలు తెలిపేందుకు హిందూ మహాసభ సిద్ధమైందనే వార్తలు వచ్చాయి. బంగ్లాదేశ్లో హిందువులపై దాడులు జరుగుతున్నాయనే కారణంతో ఆ దేశ క్రికెట్ జట్టు పర్యటనను అడ్డుకోవాలని హిందూ మహాసభ నిర్ణయం తీసుకుందని సమాచారం. అయితే, మ్యాచ్ నిర్వహణను ఎట్టి పరిస్థితుల్లోనూ కాన్పూర్ నుంచి కదలించేదే లేదని బీసీసీఐ వర్గాలు స్పష్టంచేశాయి. ఇతర వేదికలను పరిశీలించడం లేదని పేర్కొన్నాయి. "ఈ బెదిరింపులకు సంబంధించి అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తోన్నాం. మ్యాచ్ నిర్వహణకు సర్వం సిద్ధం చేస్తున్నాం. ఇక్కడికి వచ్చే క్రికెటర్లకు ఘన స్వాగతం పలుకుతాం. ఇలాంటి పరిస్థితి కాన్పూర్లోనే కాకుండా ఇతర మైదానాల వద్ద ఉన్నా సరే మేం చర్యలు తీసుకుంటాం" అని బీసీసీఐ సీనియర్ అధికారులు వెల్లడించారు. సెప్టెంబర్ 19 నుంచి ఇరు జట్ల మధ్య రెండు టెస్టుల సిరీస్ ప్రారంభం కానుంది. ఆ తర్వాత అక్టోబర్ 6 నుంచి మూడు టీ20ల సిరీస్ జరగనుంది. ఇప్పటికే పాక్ను ఓడించి జోరు మీదున్న బంగ్లా భారత్కు గట్టి పోటీనివ్వాలనే కృతనిశ్చయంతో ఉంది. ఇప్పటికే తొలి టెస్టు కోసం భారత జట్టును ప్రకటించిన సంగతి తెలిసిందే. రోహిత్ శర్మ నాయకత్వంలోని భారత్ స్క్వాడ్లోకి సీనియర్లు బుమ్రా, విరాట్ వచ్చేశారు. చాన్నాళ్ల తర్వాత రిషభ్ పంత్, కేఎల్ రాహుల్ పునరాగమనం చేశారు. యువ ఆటగాడు సర్ఫరాజ్కు అవకాశం వచ్చినా.. తుది టీమ్లో కష్టమే. దీంతో మళ్లీ అతడు దేశవాళీ దులీప్ ట్రోఫీ రెండో మ్యాచ్లో ఆడుతున్నాడు. ఒకవేళ అక్కడ మెరుగైన ప్రదర్శన చేస్తే తుది జట్టులోకి తీసుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదు.




### ఖలీద్ మహమూద్ రాజీనామా!

బంగ్లాదేశ్ క్రికెట్లో మార్పులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికే బీసీబీ అధ్యక్షుడు నజ్ముల్ హసన్ వైదొలిగిన సంగతి తెలిసిందే. తాజాగా డైరక్టర్గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మాజీ కెప్టెన్ ఖలీద్ మహమూద్ కూడా పదవిని వదిలేసినట్లు సమాచారం. 2013 నుంచి వరసగా మూడు పర్యాయాలు ఈ పదవిలో కొనసాగాడు.

### ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ హాకీ.. సెమీ ఫైనల్‌కు భారత్

**ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీలో భారత్ నాలుగో విజయం సాధించి సెమీ ఫైనల్లోకి అడుగుపెట్టింది.**

ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ హాకీలో భారత్ జైత్రయాత్ర కొనసాగుతోంది. ఇప్పటికే వరుసగా మూడు విజయాలు సాధించి భారత్.. గురువారం 3-1తో దక్షిణ కొరియాను ఓడించి సెమీఫైనల్లో అడుగుపెట్టింది. భారత్ తరఫున అరైజీత్ సింగ్ (8వ నిమిషం), కెప్టెన్ హర్మన్ ప్రీత్ సింగ్ (9వ నిమిషం, 43వ నిమిషం) గోల్స్ చేశారు. దక్షిణ కొరియా తరఫున నమోదైన ఏకైక గోల్ను జిహున్ యాంగ్ (30వ నిమిషం) సాధించాడు. భారత్ శనివారం జరిగే చివరి గ్రూప్ మ్యాచ్లో పాకిస్థాన్తో తలపడనుంది. అంతకుముందు భారత్ 3-0తో చైనాను, 5-1తో జపాన్ను, 8-1తో మలేసియాను ఓడించింది. ఆరు జట్లు పోటీపడుతోన్న ఈ టోర్నీ రౌండ్ రాబిన్ ఫార్మాట్లో జరుగుతోంది. తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీస్ లో ప్రవేశిస్తాయి.




**ఫిట్‌నెస్**

## గోరువెచ్చని నీటిలో ఈ పొడులు కలిపి తాగితే బెల్లీ తగ్గుతుంది



**బెల్లీ ఫ్యాట్.. ఈ సమస్యతో చాలామంది బాధపడతారు. దీనిని తగ్గించుకోవడానికి ఏవేవో ప్రయత్నాలు చేస్తారు. అయితే, ఇందుకోసం ఇంట్లోనే కొన్ని టిప్స్ ఫాలో అయిపోవచ్చు. వీటి కారణంగా బెల్లీని ఈజీగా తగ్గించుకోవచ్చు.**

వంటిల్లే వైద్యశాల అనే సామెత ఉంది. నిజానికీ ఇది చాలా నిజం. వంటింట్లో దొరికే పదార్థాలతోనే చాలా ఆరోగ్య సమస్యలకి చెక్ పెట్టొచ్చు. ఈ నేపథ్యంలోనే బెల్లీ ఫ్యాట్‌ని కూడా తగ్గించుకోవచ్చు. బాడీలోని మిగతా ఫ్యాట్స్ కంటే బెల్లీ ఫ్యాట్ చాలా ప్రమాదకరం. ఇది విసెరల్ ఫ్యాట్. దీని వల్ల బాడీలోని అవయవాలు దెబ్బతింటాయి. అంతేకాకుండా చాలా సమస్యలొస్తాయి. అందుకే, బెల్లీ ఫ్యాట్‌ని తగ్గించుకోవడం చాలా ముఖ్యం.దీనికి సరైన ఫుడ్ కంట్రోల్, వర్కౌట్, మంచి లైఫ్‌స్టైల్ ఫాలో అవ్వడం చాలా ముఖ్యం. వీటికి అదనంగా మనం ఇంటిచిట్కాలను కూడా పాటిస్తే చాలా లాభాలు ఉంటాయి. అందులో ఒకటి ఇప్పుడు చూద్దాం.

**కావాల్సిన పదార్థాలు..**

జీలకర్ర, మిరియాలు, దాల్చినచెక్క, పసుపు

**జీలకర్ర..**



జీలకర్రలో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉన్నాయి. ఇవి బరువు తగ్గడానికి చాలా బాగా హెల్ప్ చేస్తాయి. జీవక్రియని స్పీడ్ అప్ చేసే విటమిన్స్, ఖనిజాలు జీలకర్రలో ఉన్నాయి. అంతేకాకుండా జీర్ణక్రియ మెరుగవుతుంది జీలకర్రని తీసుకుంటే అందుకోసం సాయపడే ప్యాంక్రియాటిక్ ఎంజైమ్స్ జీలకర్రలో ఉన్నాయి. జీలకర్రలో థైమోల్ అనే సమ్మేళనం ఉంది. ఇది కొవ్వులు, చక్కెరలు, ప్రోటీన్స్ వంటి సంక్లిష్ట పోషకాల విచ్ఛిన్నత హెల్ప్ చేసి జీర్ణ ప్రక్రియని ఈజీ చేస్తుంది. జీలకర్ర జీర్ణక్రియకి చాలా మంచిది. దీనిని తీసుకోవడం వల్ల బెల్లీ ఫ్యాట్ చాలా వరకూ తగ్గుతుంది.

**మిరియాలు..**



మిరియాలు వేడిని ఉత్పత్తి చేసి జీవక్రియని పెంచుతాయి. దీని వల్ల కొవ్వు కరుగుతుంది. నల్ల మిరియాలు జీర్ణవ్యవస్థను బలంగా చేసి బరువుని తగ్గిస్తుంది. దీంతో కొవ్వు, పొట్ట తగ్గుతాయి. ఇది జీర్ణ సమస్యలకి చక్కని పరిష్కారం. మిరియాలని తీసుకోవడం వల్ల డయాబెటిస్, కొలెస్ట్రాల్ కంట్రోల్ కూడా అవుతుంది. వీటన్నింటితో పాటు కొలెస్ట్రాల్, బెల్లీ ఫ్యాట్‌ని తగ్గించడంలో హెల్ప్ చేస్తాయి. అయితే, వీటిని మితంగా తీసుకోవడం మంచిది.

**దాల్చిన చెక్క..**



కొవ్వుని తగ్గించడంలో దాల్చినచెక్క ముందుంటుంది. ఇది శరీర జీవక్రియని బలంగా చేస్తుంది. అంతేకాకుండా, మధుమేహం వంటి సమస్యల్ని దూరం చేస్తుంది. అంతేకాకుండా, బరువు తగ్గేలా చేస్తుంది. ఇందులో సిన్నమాల్డిహైడ్ అనే కెమికల్ ఉంటుంది. ఇది ఇన్సులిన్ జీవక్రియని నియంత్రించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఇది చక్కెరని చిన్న కణాలుగా మారుస్తుంది. కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉంటే అది కొవ్వుగా మార్చబడుతుంది. శరీరంలో నిల్వ చేయబడుతుంది. చక్కెర కొవ్వుగా మారి శరీరంలో నిల్వ ఉంటుంది. దీనినే ఇన్సులిన్ రెసిస్టెన్స్ అంటారు. టైప్ 2 డయాబెటిస్‌లో ఊబకాయానికి ఇది ప్రధాన కారణం. దాల్చినచెక్కలోని సిన్నమాల్డిహైడ్ చక్కెర శాతాన్ని తగ్గిస్తుంది. కొలెస్ట్రాల్ కంట్రోల్ చేసి బరువు తగ్గించడంలో కూడా దాల్చినచెక్క హెల్ప్ చేస్తుంది.



**పసుపు..**



పసుపు కూడా జీవక్రియని పెంచి బరువు తగ్గించడంలో హెల్ప్ చేస్తుంది. దీని వల్ల కొలెస్ట్రాల్ కరుగుతుంది. పసుపు శరీర వేడిని పెంచడానికి, కొవ్వుని కరిగించడానికి చాలా మంచిది. ఇది పవర్‌ఫుల్ యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉన్న కర్కుమిన్ అనే పోషకాన్ని కలిగి ఉంది. మిరియాలలోని పైపెరిన్ అనే సమ్మేళనం పసుపుతో కలిస్తే అందులోని కర్కుమిన్ కంటెంట్ పెరుగుతుంది. కర్కుమిన్ కారణంగా బరువు తగ్గుతారు.

### ఏం చేయాలి..

ఈ డ్రింక్ తయారు చేయడానికి ముందుగా 1 టేబుల్ స్పూన్ జీలకర్ర పొడి, 1 టేబుల్ స్పూన్ దాల్చిన చెక్కపొడి, అర టీ స్పూన్ మిరియాల పొడి, అర టీ స్పూన్ పసుపుని తీసుకుని ఓ గ్లాసు గోరువెచ్చని నీటిలో కలపాలి. ఇది గోరువెచ్చగా ఉన్నప్పుడే తాగండి. అయితే, వీటిని మరీ ఎక్కువగా తీసుకోవద్దు. తాగే ముందు ఆయుర్వేద డాక్టర్ సలహా తీసుకుని తాగడం మంచిది.

**గమనిక :** ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఇవి పాటించడం వల్ల ఫలితాలు అనేవి వ్యక్తిగతం మాత్రమే. వీటిని పాటించే ముందు డైటీషియన్‌ని సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.